ప్రజాశక్తి
గురువారం 7 ఆగస్టు 2025
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

బల్క్‌డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన ప్రజలు

# బల్క్‌డ్రగ్‌పై నిరసన గళం

- పోలీసు నిర్బంధాన్ని ఎదిరించి నిలిచిన ప్రజానీకం
- తమ ప్రాంతంలో ప్రమాదభరిత పరిశ్రమలు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరిక
- హోం మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అనిత తీరుపై మండిపాటు
- తీవ్ర ఉద్రిక్తతల నడుమ నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అరెస్టు

**ప్రజాశక్తి - నక్కపల్లి, రాయవరం**

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పోలీసుల ఆంక్షలు, నిర్బంధం, పహారా నడుమ చట్ట వ్యతిరేక విధానాలతో అధికారులు ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛగా వారి అభిప్రాయాలు తెలిపే అవకాశం లేకుండా చేశారు. దీనిపై బల్క్ డ్రగ్ పార్కు ప్రభావిత ప్రాంతాల వాసులతోపాటు, సామాన్య జనమూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వద్ద పోలీసులు మెప్పు పొందాలన్న ఉద్దేశంతో ఈ రకంగా వ్యవహరించారని విమర్శించారు. పోలీసుల నిర్బంధాన్ని దాటుకుని వచ్చిన జనం తమ ప్రాంతంలో ప్రమాదభరిత బల్క్ డ్రగ్ పార్క్ వద్దే వద్దని తేల్చిచెప్పారు. విష తుల్య పరిశ్రమలు ఏర్పాటు చేసి తమ జీవితాలను బుగ్గిపాలు చేయొద్దని స్పష్టం చేశారు. నక్కపల్లి, ఎస్.రాయమరం మండలాల్లోని గ్రామాల్లో 1270.80 ఎకరాల విస్తీర్ణంలో బల్క్‌డ్రగ్ పార్క్ నెలకొల్పేందుకు ఈ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని, బల్క్ డ్రగ్ పార్కు వస్తే స్థానికులకు ఉద్యోగావకాశాలు వస్తాయని ప్రజాభిప్రాయ సేకరణ

మిగతా 2లో..

అరెస్టు సమయంలో బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ నినదిస్తున్న లోకనాథం

# ప్రశాంతంగా స్థాయీ సంఘం ఎన్నికలు

## కూటమి 9 మంది, వైసిపి నుంచి ఒకరు..

**ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ :**

జివిఎంసి స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికలలో 10 మంది సభ్యులు ఎన్నికైనట్లు జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు వివరాలను కమిషనర్ మీడియాకు వెల్లడించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘం ఎన్నికలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అదనపు కమిషనర్లు డివి.రమణమూర్తి, ఎస్ఎస్.వర్మ పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. తదుపరి ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ స్థాయీ సంఘం ఎన్నికల్లో 20 మంది సభ్యులు పోటీ పడగా, 92 మంది కార్పొరేటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. 10 మంది స్థాయి సంఘం సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం సభ్యులకు ఎన్నికల్లో గెలుపొందినట్లుగా ధ్రువీకరణ పత్రాలను జివిఎంసి కార్యదర్శి బి.వి.రమణ అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విజయ చిహ్నం చూపుతున్న కూటమి సభ్యులు

### గెలుపొందిన స్థాయీ సంఘం సభ్యులు

నీలిమ కొణతాల 58 ఓట్లు, గంకల కవిత 57 ఓట్లు, దాడి వెంకట రామేశ్వరరావు 57 ఓట్లు, మొల్లి హేమలత 57 ఓట్లు, సేనాపతి వసంత 54 ఓట్లు, గేదెల (బంటుబిల్లి) లావణ్య 53 ఓట్లు, మాదంశెట్టి చినతల్లి 52 ఓట్లు, రాపర్తి త్రివేణి వరప్రసాదరావు 52 ఓట్లు, మొల్లి ముత్యాలు 51 ఓట్లు, సాడి పద్మావతి (పద్మారెడ్డి)కు 50 ఓట్లు పోలైనట్లు కమిషనర్ తెలిపారు. వీరిలో 9 మంది కూటమి కార్పొరేటర్లు కాగా ఒకరు వైసిపి నుండి విజయం సాధించారని వివరించారు.

### ఓటింగ్‌కు దూరంగా సిపిఎం

సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఓటింగ్‌లో పాల్గొనలేదు. జివిఎంసిని గత వైసిపి, నేటి టిడిపి, జనసేన, బిజెపి

మిగతా 2లో..

# భూములు కారు చౌకగానే..

- ఐటి కంపెనీలకు రూ.99పైసలకే...
- మారని చంద్రబాబు విధానం...
- 'వ్యయ ఆధారిత-ఆకర్షణ వ్యూహం' పేర నూతన ఐటి పాలసీ
- రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఐటి రంగానికి సంబంధించి ఎపి ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ (లిఫ్ట్) పాలసీని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రం అంతటా ప్రతి ఎకరానికి 0.99 పైసలు మాత్రమే సదరు కంపెనీలకు ఇచ్చేయడానికి సిద్ధమైంది. దీని ప్రకారం భూములన్నిటినీ 'లిఫ్ట్' చేసి ఐటి కంపెనీలకు 99పైసలకే ఎకరాను కట్టబెట్టే చర్యలకు పూనుకోవడం ఈ విధానం విశిష్టత. 'వ్యయ ఆధారిత-ఆకర్షణ వ్యూహం' పేరుతో సమాచార సాంకేతిక ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యాన 2024-2029 (లిఫ్ట్) పాలసీ రాష్ట్రంలో అమలు కానుంది. ఇలా భూములను కారుచౌకగా సదరు సంస్థలకు ఇచ్చేసేందుకు ప్రభుత్వం చెబుతున్న కారణం చూస్తే 'ఏపిలో మౌలిక సదుపాయాలు, ప్రతిభను సద్వినియోగం చేసుకోడానికేనట. బెంగళూరు, హైదరాబాద్, గుర్గావ్ వంటి టైర్-1 నగరాల్లో పెరుగుతున్న రద్దీ, వ్యయాలను దృష్టిలో పెట్టుకుని భూమిని అభివృద్ధికి చోదక శక్తిగా ఎంచుకున్నట్లు ప్రభుత్వం విధానం వెల్లడించింది. ప్రముఖ కంపెనీలను ఆకర్షించేందుకు గానూ ఐటి-ఐటిఇఎస్ సంస్థలకు 3ఏళ్లలో కనీసం 3వేలు ఉద్యోగాలు, ఎకరానికి 500 ఉద్యోగాలు సృష్టించాలని షరతు పెట్టింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఎకరాకు 2వేల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుందని రాష్ట్ర కేబినెట్ స్పష్టం చేసింది. ఐటి పార్క్ డెవలపర్లకు ఇప్పటికే కనీసం లక్ష చదరపు అడుగులు నిర్మాణం చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. నిర్మాణ కాలం విషయానికొస్తే విక్రయ ఒప్పందం నుంచి 6 నెలల్లో చట్టబద్ధ లైసెన్సులు, నిర్మాణ పనుల ప్రారంభం తప్పనిసరి అని నిబంధన పెట్టారు. ఏ కంపెనీలు ఎప్పుడు వస్తాయో? ఎంత పెట్టుబడులు పెట్టి ఎంతమందికి ఉద్యోగాలిస్తాయన్నది ఖరారు కాలేదు. భూములు మాత్రం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఇన్వెస్టర్లకు ఇరకాటం తప్పదా!

విశాఖ రుషికొండపైనా, మధురవాడ ఐటి సెజ్‌లోనూ ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వం పదుల సంఖ్యలో భూములను ఐటి సంస్థలకు దారాదత్తం చేసిన సంగతి తెలిసిందే. వాటిలో టిసిఎస్, ఉర్సా, సత్వ, కాగ్నిజెంట్ వంటి కంపెనీలకు పెద్ద ఎత్తున క్యాంపస్‌లు, కంపెనీలు పెట్టుకునేందుకు భూములను కేటాయించింది. సుమారు రూ.1500 కోట్లకు పైగా నిధులతో కాగ్నిజెంట్ టెక్ సొల్యూషన్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నది తెలుస్తోంది. రాబోయే 8 ఏళ్లలో 8వేల ఉద్యోగాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. విఎంఆర్‌డిఎ ద్వారా కాపులుప్పాడ వద్ద 21.31 ఎకరాలను కాగ్నిజెంట్ మరలా కోరింది. టిసిఎస్‌కు 20 ఎకరాలు, ఉర్సాకు సుమారు 60 ఎకరాలు, సత్వకు 30 ఎకరాలను ఇప్పటికే

మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

## భూములు కారు చౌకగానే...

కూటమి ప్రభుత్వం దారాదత్తం చేసింది. ఎకరాను రూ.90 పైసలకే ఇవ్వాలన్న నిర్ణయంపై సర్వత్రా అన్ని తరగతుల నుంచీ వ్యతిరేకత వస్తున్నప్పటికీ ప్రభుత్వం లెక్కజేసినట్లు లేదు. కేబినెట్‌లోనూ తాజాగా 99 పైసలకే ఎకరాను ప్రకటించడం చూస్తుంటే భూ సంతర్పణకు విశాఖ కేంద్రంగా మారనుందన్నది స్పష్టమవుతోంది. గతంలో టూరిజం ప్రాజెక్టులు, ఐటి సంస్థల ఏర్పాటుకు సంబంధించి 2023 గత ప్రభుత్వంలో జరిగిన ఒప్పందాలేవీ కొలిక్కి రాని పరిస్థితి ఉంది. తాజా కేబినెట్ సమావేశం చూస్తే భూముల కేటాయింపుల నిర్ణయం జరగడం ఒకటైతే 2029లోపు ఈ కంపెనీలు పూర్తిస్థాయిలో వస్తాయన్నది చెప్పడం చూస్తే ఒకవేళ ప్రభుత్వం మారితే ఇన్వెస్టర్లకు ఇరకాటమే కదా? కేటాయింపులు జరిగిన భూమి సంగతేమిటి? అన్న చర్చ సాగుతోంది. లూలూ సంస్థను గత ప్రభుత్వం రద్దు చేయగా చంద్రబాబు ప్రభుత్వం వెనక్కి రప్పించి బీచ్‌రోడ్డులో మాల్‌కు అవకాశం కల్పించడం చూస్తే ప్రభుత్వాలు మారితే చాలా వరకూ తారుమారు కాకుండా ఉంటాయా? అన్నది ప్రశ్న.

## ప్రశాంతంగా స్థాయీ సంఘం ఎన్నికలు

కూటమి పాలకవర్గం పూర్తిగా అవినీతిమయం చేశాయని, మొదటి నుండి సిపిఎం అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుతోందని, ఈ పరిస్థితిలో పార్టీ జిల్లా కమిటీ ఆదేశానులకనుగుణంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పాల్గొనలేదు. ఈ అంశాన్ని ముందుగానే గంగారావు ప్రకటించారు.

**ఫలితం కూటమి పాలనకు చెంపపెట్టు : కెకె.రాజు**

జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కార్పొరేటర్లు ఇచ్చిన తీర్పు కూటమి పాలనకు చెంపపెట్టు అని వైసిపి విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కెకె.రాజు అన్నారు. ఫలితాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి పార్టీ కార్పొరేటర్లు వైసిపికి ఓటు వేసారంటే ఆ ప్రభుత్వంపై వ్యతిరేకత ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఎన్నడూ డబ్బుతో రాజకీయం చెయ్యలేదని, కానీ ఈ ఎన్నికల్లో కూటమి పార్టీ క్యాంపు రాజకీయం చేసిందని విమర్శించారు. తమకున్న 32 మంది కార్పొరేటర్లు కాకుండా మరో 18 మంది వైసిపికి అనుకూలంగా ఓటు వేశారని తెలిపారు.

## అన్ని రోడ్లు పూర్తి చేస్తాం : వంశీకృష్ణ

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** దక్షిణ నియోజకవర్గంలోని పెద్దపెద్ద రోడ్లతో పాటు, చిన్న రోడ్లను కూడా ఈసరికే 90 శాతం అభివద్ధి చేశామని, మిగిలిన 10 శాతం రోడ్లను, 2, 3 నెలల వ్యవధిలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. 39వ వార్డులో రూ. 1.10 కోట్ల జివిఎంసి నిధులతో చేపట్టే వివిధ రోడ్ల నిర్మాణాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్కువ కాలంలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జివిఎంసి కమిషనర్‌తో పాటు పలు వార్డుల్లో తాను సందర్శించి అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ అధికారుల సమాధులను కాపాడాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని బ్రిటీష్ అధికారుల సమాధుల స్థలాన్ని ఆక్రమించిన వారిని తొలగించి, పూర్తిగా స్వాధీనం చేసుకొని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు అప్పగించాలని కోరుతూ బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం ఎఐడిఎస్ఒ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా, ఎఐడిఎస్ఒ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు అభిలాష్, కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ, 100 ఏళ్ల నాటి చారిత్రక ప్రదేశాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

**PASSPORT LOST**

I. **BOKAM JAGADISH KUMAR**
S/o. Jnaneswara Rao Bokam
aged 39 years, Residing at
D.No. 3-97, Gullepalli,
Sabbavaram Mandal
Anakapalle District-531035
I Lost My Original Passport Vide
**Passport No. R8514297**
While travelling to Sabbavaram
on 08-04-2025. If anyone found
please Contact Me
**Cell : 99891 80291**

**PASSPORT LOST**

I. **NIRUJOGI BHARATHI**
W/o. Jagadish Kumar Bokam
aged 37 years, Residing at
R/o. D.No. 22-120-16,
Dayal Nagar, Pedagantyada,
Visakhapatnam- 530044.
I Lost My Original Passport Vide
**Passport No. R9328597**
While travelling to Sabbavaram
on 08-04-2025. If anyone found
please Contact Me
**Cell : 99891 80291**

**మొదటి పేజీ తరువాయి..**

## బల్క్ డ్రగ్‌పై నిరసన గళం

కోసం వచ్చిన నర్సీపట్నం ఆర్‌డిఒ, ఆర్ అండ్ ఆర్ అధికారి వివి.రమణ, జెడ్‌ఒ టి.సుదర్శనం, ఇఇఆర్‌ఒ ముకుందరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహశీల్దార్ నరసింహమూర్తి తదితరులు తెలిపినా ప్రజలు వారి మాటలను నమ్మలేదు. గతంలో ఇలానే మాటలు చెప్పి హెటిరో, డెక్కన్ కంపెనీలను ఏర్పాటు చేసి మోసం చేశారని గుర్తుచేశారు.

**ఆందోళనల పర్వం**

బల్క్ డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణ వద్ద రోజంతా తీవ్ర ఆందోళనలపర్వం నెలకొంది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు వస్తుండగా పోలీసులు ఆయన్ని అడ్డుకుని, ఈడ్చుకుంటూ వెళ్లి వ్యాన్ ఎక్కించారు. అక్కడి నుంచి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మత్స్యకారులు, అక్కడకు వచ్చిన నిర్వాసితులు ఆ వ్యాన్‌ను అడ్డగించారు. తమ గళం వినిపించే నేతను ఎందుకు అన్యాయంగా అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులు వారిని నెట్టేసి లోకనాథంను అరెస్టు చేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఒకపక్క ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుండగా మరోపక్క మత్స్యకారులు, నిర్వాసితులు, సిపిఎం, వైసిపి, కాంగ్రెస్ నాయకులు బయట బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఒకానొక సందర్భంలో ఆందోళన కారులందరూ వేదిక వద్దకు వచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద సంఖ్యలో జనం బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకించారు. పలువురు మాట్లాడుతున్న సమయంలో పోలీసులు మైక్ కట్ చేయడంతో అధికారులు, పోలీసుల తీరుపై జనం అసహనం వ్యక్తం చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణలో బల్క్‌డ్రగ్ పార్కు వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డిఒ రమణ

**ఇంత దుర్మార్గమా ? : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం**

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు ప్రజలు జీవించే హక్కును హరించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి నిర్బంధం నడుమ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. బల్క్ డ్రగ్ పార్కుకు 1270 ఎకరాల భూములకు తీసుకుంటున్నారని, 470 ఎకరాలకు మాత్రమే నష్టపరిహారమిచ్చి మిగిలిన వాటికి ఏ విధమైన నష్టపరిహారమూ చెల్లించకుండా ముందుకెళ్లడం దుర్మార్గమన్నారు. హోం మంత్రి అనిత సొంత నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం తగదన్నారు. ప్రజలు అన్నింటినీ గుర్తిస్తున్నారన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు న్యాయమన్నారు. అణిచివేత, నిర్బంధంతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

# రెప్కో బ్యాంక్ నికర లాభం రూ.140 కోట్లు

అమిత్‌షాకు డివిడెంట్ చెక్కును అందిస్తున్న రెప్కో బ్యాంకు ప్రతినిధులు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ :** రెప్కో బ్యాంక్ 2024-25 సంవత్సరానికి రూ.140 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసిందని బ్యాంకు చైర్మన్ ఇ.సంతానం, డైరెక్టర్ బి.తంగరాజు తెలిపారు. ఇది రెప్కో బ్యాంకు చరిత్రలోనే అత్యధికమని పేర్కొన్నారు. అత్యధిక లాభాన్ని నమోదు చేసినందుకు గాను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రెప్కో బ్యాంకు టీమ్‌ను అభినందించినట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రికి రెప్కో బ్యాంక్ రూ.22.90 డివిడెంట్ చెక్కును ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మన్ ఒ.ఎం.గోకుల్, డైరెక్టర్లు ఆర్.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## 4వ పట్టణ స్టేషన్ సిఐ బదిలీ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ శాంతి భద్రతల ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.సత్యనారాయణను విశాఖపట్నం సిటీ సోషల్ మీడియా సెల్, కోర్టు మోనిటరింగ్ సిస్టం విభాగానికి బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సోషల్ మీడియా సెల్, కోర్టు మానిటరింగ్ సిస్టం విశాఖపట్నం సిటీలో పనిచేస్తున్న సి హెచ్.ఉమాకాంత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రణవ్‌గోపాల్‌ను కలిసిన డిఎస్‌డిఒ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవగోపాల్‌ను జిల్లా క్రీడల అధికారి ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నగరంలో క్రీడా కార్యక్రమాల నిర్వహణ, వసతులపై చర్చించారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికల పాత్ర ప్రశంసనీయం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** సమాజ అభివృద్ధిలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికలు ప్రశంసనీయమైన పాత్రను నిర్వహిస్తున్నాయని శ్రీసరస్వతి విద్యావిహార్ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ కె.సంజీవి తెలిపారు. జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విశాఖ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం కీర్తన్, జెవికె.అప్పలరాజు ఆధ్వర్యాన బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో చిన్న దినపత్రికల సంపాదకులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రజల విశ్వసనీయతను పొందేందుకు పత్రికలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ స్వాతంత్ర్య సమపార్జనలో ఆనాడు పత్రికలు పోషించిన పాత్రను గుర్తు చేశారు. జాప్ అధ్యక్షుడు కె.ఎం కీర్తన్ మాట్లాడుతూ, చిన్న పత్రికల నిర్వహణ నేడు ఎంతో కష్టంగా ఉందని, ప్రభుత్వం ప్రకటనలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంటా చంద్రశేఖర్, వడ్డాది ఉదయ్ కుమార్, పిఎఆర్.పాత్రుడు, గొట్టివాడ దానేష్ , సందీప్ పాల్గొన్నారు.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT YELAMANCHILI.**
**I.A. /2025 in O.S. 20 of 2022.**

**Between:**
Janapareddy Suresh ...**Plaintiff.**
**And:**
Mogalaturti Kanakachari ...**Defendant.**

**To,**
**Mogalaturthi Kanakachari,**
s/o Narayana Murthy, Hindu,
aged 42 years, Business,
residing at D.No.8-42, Pedapaadu,
Timmarajupeta Post, Atchutapuram
Mandal, Visakhapatnam District.

**SUIT SUMMONS.**

The plaintiff filed the above suit for recovery of a sum of Rs.17,01,333/-(Rupees Seventeen Lakhs One Thousand Three Hundred and Thirty Three Only) and for other reliefs and the above suit stands posted to **dt. 18-08-2025** for your appearance. Hence you are here by directed to appear either personally or through your counsel on that day before the above court, and if you fail to appear **on or before 10.30 A.M. on DT.18-08-2025** the matter will be proceeded in your absence.

**Sri. Y.Nageswara Rao,**
**Sri.K.Sandeep,**
**Advocates, Anakapalle.**
**Ph: 90304 63483.**
Anakapalle,
Dt.07-08-2025.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT YELAMANCHILI.**
**I.A. /2025 in I.A.42/2022 in O.S. 20 of 2022.**

**Between:**
Janapareddy Suresh ...**Petitioner.**
**And:**
Mogalaturti Kanakachari ...**Respondent.**

**To,**
**Mogalaturthi Kanakachari,**
s/o Narayana Murthy, Hindu,
aged 42 years, Business,
residing at D.No.8-42, Pedapaadu,
Timmarajupeta Post, Atchutapuram
Mandal, Visakhapatnam District.

**I.A. NOTICE.**

The petitioner filed the above petition for conditional attachment of the schedule property which belongs to you for recovery of a sum of Rs. 17,01,333 /- (Rupees Seventeen Lakhs One Thousand Three Hundred and Thirty Three Only) and the above petition stands posted to **dt.18-08-2025** for your appearance. Hence you are here by directed to appear either personally or through your counsel on that day before the above court, and if you fail to appear **on or before 10.30 A.M. on DT.18-08-2025** the matter will be proceeded in your absence.

**Sri.Y.Nageswara Rao,**
**Sri.K.Sandeep,**
**Advocates, Anakapalle.**
**Ph: 90304 63483.**
Anakapalle,
Dt.07-08-2025.

**మహారాజశ్రీ యలమంచిలి ప్రధాన సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో**
**E.P No. 51/2024 IN OS NO 15/2022**

**బిట్వీన్:**
పారుపల్లి నవీనదేవి @ పారుపల్లి వెంకట నవీనదేవి . . . పిటిషనర్/D.Hr
**అండ్:**
మొగలతుర్తి కనకాచారి . . . రెస్పాండెంట్/J.Dr

**నోటీసు**

**టు:**
**రెస్పాండెంట్/J.Dr:-**
మొగలతుర్తి కనకాచారి
తండ్రి నారాయణమూర్తి, వయసు 48,
వ్యాపారం, డో.నెం.1-1, పెదపాడు గ్రామం,
తిమ్మరాజుపేట, అచ్యుతాపురం మండలం,
అనకాపల్లి జిల్లా.

పై నెంబర్ E.P.లో పై కోర్టు వారు పంపిన నోటీసులు మీరు అందుకోనందున, సదరు కోర్టు వారు మీ హాజర్ నిమిత్తం **28-8-2025వ తేదీకి** వాయిదా వేసి ఉన్నారు. కావున **ఆరోజు ఉదయం 10:30 నిమిషములకు** మీరు స్వయంగ గాని లేక మీ తరఫున లాయరు గారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబర్ E.P. తీర్మానించ బడును.

**B.V.S.K. విశ్వనాథం**
అడ్వకేట్, అనకాపల్లి.
సెల్:9885089717

**మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి రామచంద్రపురం వారి కోర్టులో**
**E.P.49/2019 O.S.44/1995**

**Between-**
రెడ్డి లక్ష్మి, W/o.లేటు సూర్యారావు, 69 సం॥లు, మండపేట, కోనసీమ జిల్లా, **... DHR/Plaintiff**
And
మద్ది సూర్యనారాయణ రెడ్డి,(Died) అండ్ అదర్స్ **... JDRS/Defendants**

**నోటీసు**

To.
**R4.** మద్ది కాంతం, W/o.లేటు పైడారావు, 80yrs, డో.నెం.2-56/2, కుమారపురం, పాయకరావు పేట మండలం, అనకాపల్లి జిల్లా.
**R5.** మద్ది సరోజని, W/o.లేటు సూర్యనారాయణరెడ్డి, డో.నెం.2-56/2, కుమారపురం, పాయకరావు పేట మండలం, అనకాపల్లి జిల్లా.
**R6.** మద్ది జ్ఞానేంద్రప్రసాద్ రెడ్డి, S/o.లేటు సూర్యనారాయణరెడ్డి, డో.నెం.2-56/2, కుమారపురం, పాయకరావు పేట మండలం, అనకాపల్లి జిల్లా.
**R7.** మద్ది హారదీప్ రెడ్డి, S/o. సూర్యనారాయణరెడ్డి, డో.నెం.2-56/2, కుమారపురం, పాయకరావు పేట మండలం, అనకాపల్లి జిల్లా.
**R8.** మద్ది శిరీషదేవి, D/o. సూర్యనారాయణరెడ్డి, డో.నెం.2-56/2, -do- -do-

పై నెంబరు గల E.P. లో సదరు DHR మిమ్మల్ని సూర్యనారాయణరెడ్డి గారి వారసులు(LRs) గా చేర్చి యున్నారు.

పై నెంబరు గల E.P. లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు తీసుకోని కారణంగా కోర్టు వారు ఉత్తర్వులపై మీకు తెలియజేయునది ఏమనగా, పై E.P. **19-08-2025** తేదీన వాయిదా అయి ఉన్నది. కావున **19-08-2025** తేదీన ఉయం **గం.10.30ని॥లకు** మీరు స్వయంగా గాని ప్లీడర్ ద్వారా గాని హాజరు కానియెడల మీ పరోక్షమున పై మేటరు తీర్మానించబడుతుంది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**కె.వి.సత్యవాణి**
అడ్వకేట్
ది.06-08-2025 రామచంద్రపురం,తూ॥గో॥జిల్లా

# వైద్యుల సమక్షంలోనే ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

**- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 12వ తేదీన జరిగే నులిపురుగుల (డీ వార్మింగ్ డే) నివారణ దినోత్సవంగా చిన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యుల సమక్షంలోనే వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. అనుకోని రీతిలో రియాక్షన్స్ వచ్చిన క్రమంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ నెల 12వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా విశాఖపట్నం జిల్లాలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన కన్వర్జెన్స్ కమిటీ సమావేశంలో వివిధ అంశాలపై వైద్యులకు, ఇతర విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై దుష్పరిణామాలు చూపే నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నిర్దేశించారు.

అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదివే 1-19 ఏళ్ల వయసు గల బాల, బాలికలకు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందించాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో కవర్ కాని పిల్లలను గుర్తించి ఆగస్టు 20వ తేదీన ప్రత్యేకంగా మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు అనంతరం సంబంధిత పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశం లో డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఆర్‌బిఎస్‌కె సమన్వయకర్త డాక్టర్ ఎన్‌వి.సమత, ఎన్‌టిఆర్ వైద్యసేవా జిల్లా సమన్వయ కర్త డాక్టర్ కె.అప్పారావు, జిల్లా గణాంకాధికారి బి.వి.విజయలక్ష్మి, కెజిహెచ్ ఆర్‌ఎంఒ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వైసిపి బిసి సెల్ అధ్యక్షునిగా కోరాడ

కోరాడ ఆదినారాయణ

ప్రజాశక్తి -ఆనందపురం: వైసిపి బిసి సెల్ ఆనంద పురం మండల అధ్యక్షుడిగా కోరాడ ఆది నారాయణ నియమితుల య్యారు. తర్లువాడ గ్రామానికి చెందిన ఆదినారాయణ యువ నాయ కుడిగా, స్వచ్ఛంద సేవకుడి గా పేరు పొందారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ అన్ని వర్గాల అభిమానం పొందారు.ఈ సందర్భంగా ఆదినారాయణను ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి గన్ ఒడ్డి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం తదితరులు అభినందించారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆదినారాయణ అన్నారు.

## యుజిడి మరమ్మతులు

యుజిడి మరమ్మతులు చేస్తున్న జివిఎంసి సిబ్బంది

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ, ఆపరేషన్ కాలనీలో యుజిడి అధ్వానస్థితిపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ స్పందించారు. బుధవారం జివిఎంసి యుజిడి సిబ్బందిని రప్పించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించారు. అలాగే వార్డు శివారు ప్రాంతమైన పైనాపిల్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్‌ఎం బ్లాక్ పరిసర ప్రాంతాల్లో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను జెసిబితో తొలగించారు. సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేసిన స్థానికులు కార్పొరేటర్, జివిఎంసి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు

# ల్యాండ్ పూలింగ్ నిర్వాసితులకు ఇంటి పట్టాలు

పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఆనందపురం: రామవరం, జివిఎస్.అగ్రహారం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ రాష్ట్రానికే ఆదర్శమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన నిర్వాసిత రైతులకు ఎల్‌పిఒసి యాజమాన్య హక్కు పట్టాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, పేదలకు ఇళ్లస్థలాల పంపిణీకి ఆనందపురం మండలంలోని 2 వేల నుంచి 3 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో రామవరం, జివిఎస్.అగ్రహారం గ్రామాల్లో రైతులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 230ఎకరాలను ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని, ఆయా భూములను విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో లేఅవుట్లు రూపొందించడంతో పరిసర భూముల ధరలు గణనీయంగా పెరిగాయన్నారు.. విశాఖలో టిసిఎస్, కాగ్నిజెంట్, సత్వ వంటి ఐటి కంపెనీలు త్వరలో రానున్నాయని, తర్లువాడలో 200 ఎకరాల్లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. భీమిలి ప్రాంతం ఒకవైపు బీచ్, మరొకవైపు నేషనల్ హైవే ఉండటంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ, సాగర్‌నగర్‌లాంటి రెసిడెన్షియల్ శాటిలైట్ టౌన్‌షిప్‌లు మరిన్ని అవసరమని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ పరిధిలోని ఏడు ఇనాం గ్రామాల్లో రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ, ఆక్రమిత భూముల్లో నివాసితులకు పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ కె. సంగీత్ మాథుర్, కలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పంచకర్ల నాగసందీప్, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, కూటమి నాయకులు సుభాష్‌చంద్రబోస్, కె. రామస్వామినాయుడు, తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి. నాయుడు, శ్రీకాంత్ రాజు, గంట్రెడ్డి సోమినాయుడు, పాండ్రంగి అప్పల రాజు, శాఖరి శ్రీనివాస్, బలిరెడ్డి మల్లికార్జునరావు, కోరెడ్డి దామోదరరావు, కాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

**టిడిపిలో పలువురు చేరిక**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో పలువురు వైసిపి నేతలు బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గండిగుండం గ్రామానికి చెందిన వైసిపి మాజీ అధ్యక్షుడు మదపాడ శ్రీను తన అనుచరులతో ఎమ్మెల్యే గంటా సమక్షంలో టిడిపిలో చేరగా, సీనియర్ నేతలు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, గన్ రెడ్డి సోంబాబు, రమేష్ కండువాలు కప్పి ఆహ్వానించారు. గండిగుండం ఉప సర్పంచ్ సరగడ అప్పారావు, ఎద్దు రాము, లావేటి పోలయ్య, బంటు చిన్న, పొట్నూరు పైడయ్య, నిమ్మకాయల గురుమూర్తి, కరకాన సత్తిబాబు, గోరపల్లి ఈశ్వరరావు, ఇల్లపు అచ్చం నాయుడు, ఎలుగుబంటి సోంబాబు, కష్ట, దుర్గారావు టిడిపిలో చేరారు. అలాగే పాలవలస ఎంపిటిసి రౌతు శ్యామల, ఉపసర్పంచ్ చందక ఎల్లారావు, వార్డు సభ్యులు నిమ్మల లక్ష్మీ, రౌతు వెంకట్రావు, కంచుబోయిన తమ్మినాయుడు, రౌతు పెదవెంకట్రావు, పేడా శంకర్రావు, మామిడి ఉదయ్ శంకర్, రౌతు రమణ,టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

# తీర ప్రాంత భద్రతపై మాక్ డ్రిల్

గీతంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ బలగాలు

ప్రజాశక్తి-మధురవాడ : తీర ప్రాంత భద్రతతో పాటు తీవ్రవాదుల చొరబడినప్పుడు అత్యవసర పరిస్థితులలో ఎలా స్పందించాలి, సమర్థవంతమైన రక్షణ చర్యలు ఎలా చేపట్టాలి అనే అవగాహనకు ఆక్టోపస్ చార్లీ టీమ్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో ఆక్టోపస్ కమాండోలు అత్యాధునిక ఆయుధాలతో గీతంలోని పలు భవంతులలో తీవ్రవాదులను గుర్తించి, వర్సిటీ సిబ్బందిని రక్షించే ఆపరేషన్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. చార్లీటీమ్ ఉన్నతాధికారులు డిఎస్‌పిలు తిరుపతయ్య, డి.రాంబాబు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్.శివాజి, పిఎస్‌ఎం.రెడ్డి, వి.శ్రీనివాసరావు పాల్గొని అత్యవసర పరిస్థితులలో విద్యార్థులు, సిబ్బంది, గీతం భద్రత విభాగం ఎలా స్పందించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గీతం సేఫ్టీ విభాగం ఆధికారి కె.పి.చక్రధర్, గీతం విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ గోపి కుమార్, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, పాల్గొన్నారు. మాక్ డ్రిల్ అనంతరం ఆక్టోపస్ బృందానికి గీతం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# మాతృ మరణాలకు ఆస్కారమివ్వొద్దు

**జిల్లాస్థాయి సమీక్షలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావు**

ప్రజాశక్తి -సీతమ్మధార : జిల్లాలో మాతృమరణాలకు ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ .పి.జగదీశ్వర రావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో మాతృమరణాలపై జిల్లాస్థాయి కమిటీ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ గతనెలలో బుచ్చిరాజుపాలెం యుపిహెచ్‌సి పరిధిలో మాతృమరణం చోటుచేసుకుందని, మున్ముందు ఇటువంటి మరణాలు జరగడానికి వీల్లేదని ఎఎన్‌ఎం, హెచ్‌విలను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో గర్భిణి వివరాలను వెంటనే నమోదు చేసుకోవాలని, వారికి వ్యాక్సినేషన్, అవసరమైన మందులు అందించాల న్నారు. వైద్యనిపుణులతో పరీక్షలు చేయించడంతోపాటు సాధారణ ప్రసవానికి తీసుకోవాల్సిన చర్యలు, పౌష్టికాహారంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. కెజిహెచ్, విజిహెచ్ గైనకాలజిస్టులు మాట్లాడుతూ, హైరిస్క్ ప్రెగ్నన్సీని గుర్తించిన వెంటనే అత్యవసరంగా వైద్యనిపుణుల పర్యవేక్షణలో వారికి వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రి ప్రసవాలకు వారిని ప్రోత్సాహించడం ద్వారా మాతా,శిశు మరణాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత పారా మెడికల్ సిబ్బందిపై ఉందన్నారు.

సమావేశంలో డిఐఒ, నోడల్ అధికారి డాక్టర్ లూసీ, విజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యారమ, కెజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ షర్మిలా కుమారి, డాక్టర్ వి.వి.శ్రావణ్, ఎనాస్తీసియాలజిస్ట్ డాక్టర్ రమ్య చిత్ర, విమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ .ఎన్‌వి.సమత, బ్లడ్ బ్యాంకు డాక్టర్ బి.నాయుడు, 108 సేవలు డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ త్రినాధరావు, డిపిహెచ్‌ఎన్‌ఒ ఎం .సత్యవతి, బుచ్చిరాజుపాలెం యుపిహెచ్‌సి డాక్టర్. ఆర్.రేవతి, శ్రీకాకుళం రిమ్స్, బుడితి సిహెచ్‌సి వ వైద్యులు,ఎఎన్ఎంలు, హెచ్‌విలు ,ఆశాలు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

# 10కిలోల గంజాయి స్వాధీనం

**- తమిళనాడుకు చెందిన ఇద్దరు అరెస్ట్**

ప్రజాశక్తి -గోపాలపట్నం : తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 10 కిలోల గంజాయిని గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలివి. పక్కాగా అందిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి, ఆదిత్య కాలేజీ వెనకాల రోడ్, శ్మశానవాటిక వద్ద, విద్యానగర్, గోపాలపట్నం ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. తమిళనాడుకు చెందిన అశోక్, ప్రభాకర్ అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదరీతిలో సంచరిస్తుండగా, వారి బ్యాగ్‌లను తనిఖీ చేయగా పది కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సిఐ ప్రభాకర్‌కు అప్పగించగా,ఆయన సూచనల మేరకు అరెస్ట్ చేశామన్నారు.

## డాక్టర్ పిజె.సుధాకర్ కన్నుమూత

డాక్టర్ పిజె.సుధాకర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సమాచార, ప్రసార శాఖలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ హోదాలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఐఎస్ఎస్ అధికారి డాక్టర్ పిజె. సుధాకర్ బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతోకన్నుమూశారు. దూరదర్శన్ ఆల్ ఇండియా రేడియో పిఐబి తదితర విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహిం చారు. నగరంలోని పెందుర్తి మండలం చిన ముషిడివాడ, శాంతినగర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గరలో ఆయన నివాసం. అక్కడ గురువారం ఉదయం 9 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## విమానాశ్రయ పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎయిర్ పోర్టు పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని, డ్రెయిన్ల ద్వారా మురుగు, వర్షపు నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైవర్లు ఆహార పదార్థాలను ఎయిర్ పోర్టు గోడ సమీపంలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పక్షులు రావడానికి అవకాశాన్ని కల్పించరాదని సూచించారు. మేఘాద్రి గెడ్డ, ఇతర గెడ్డల్లో పూడికపోయిన చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని, ఎయిర్ పోర్టు పరిసరాల్లో నిర్మాణ సామగ్రి, చెత్త చెదారం డంపింగ్ చేయరాదని పేర్కొన్నారు. అపరిశుభ్రత, ప్రమాద కారకాలైన ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎన్.పురుషోత్తం మాట్లాడుతూ, ఇటీవల కాలంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఎయిర్ పోర్టు, ఐఎన్ఎస్ డేగా పరిసరాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించామని, దానిలో భాగంగా పలు ఇబ్బందికర పరిస్థితులను గుర్తించామని వెల్లడించారు. ప్రధానంగా పరిసరాల్లో చెత్త వేస్తున్నారని, నిర్మాణ సామగ్రిని డంపింగ్ చేస్తున్నారని చెప్పారు. ఎయిర్ పోర్టు లోపల ఉన్న నీటి కుంటల వద్ద పక్షులు చేరకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని, పూడిక, పిచ్చి మొక్కలను తొలగించాల్సి ఉందని తెలిపారు. ఎయిర్ పోర్టు అథారిటీ, విశాఖ పోర్టు, ఐఎన్ఎస్ డేగా, జివిఎంసి, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా రమేష్

దాడి రమేష్‌ను అభినందిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్

ప్రజాశక్తి -గోపాలపట్నం: జివిఎంసి స్థాయీసంఘం ఎన్నికల్లో స్టాండింగ్ కమిటీ సభ్యునిగా, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ఎన్నికయ్యారు. ఆయనను నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అభినం దించారు. 89వ వార్డు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ఆయన శుభాకాంక్షలు తెలిపారు

## రాష్ట్రస్థాయి యోగా పోటీలకు శిరీష

సాధించిన పతకాలతో శిరీష

**ప్రజాశక్తి-పద్మనాభం** : ఈనెల 21న జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలం లోని కృష్ణాపురం గ్రామానికి చెందిన చలపాక శిరీష ఎంపికైంది. 3న యోగా అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి యోగాసనాల పోటీల్లో మహిళా విభాగం లో ట్రెడిషనల్ యోగా, ఆర్టిఫికెట్ యోగాతో డాన్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను సాధించడం ద్వారా రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన శిరీష, అవకాశాలను అందిపుచ్చుకుంటూ యోగాపోటీల్లో విశేషంగా రాణించి, అంచెలంచెలుగా ఎదిగి, నేడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై గ్రామస్తులతోపాటు పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటి, మరిన్ని పతకాలను సాధించడం ద్వారా ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## క్రీడాకారులకు జెర్సీల పంపిణీ

ఫుట్ బాల్ క్రీడాకారులకు జెర్సీలు పంపిణీ చేస్తున్న అప్పలకృష్ణ

**ప్రజాశక్తి-తగరపువలస** : సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు జామి అప్పలకృష్ణ మనవరాలు ఎం లతిక, మనవడు లిథిక్ పుట్టిన రోజు సందర్భంగా 36 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులకు బుధవారం జెర్సీలు, షార్ట్‌లు అందజేశారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో అప్పలకృష్ణ ఆర్థికసాయంతో సమకూర్చిన వీటిని క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, సీనియర్ క్రీడాకారులు జెడ్సెన్, చిన్నరెడ్డి, ఎ.శివ, సిహెచ్ వెంకటేష్, మహేష్, టీచర్స్ హెల్ప్ అధ్యక్షులు కె ముత్యాలరావు, కార్యదర్శి మరగడ రామకృష్ణ పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గల్లా



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

**ప్రజాశక్తి- పెందుర్తి** : నరవ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత గల్లా శ్రీనివాసరావును పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 35ఏళ్ల పాటు టిడిపి కార్యకర్తగా ఉన్న గల్లా శ్రీను ప్రస్తుతం జనసేన తరఫున ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాడే శ్రీనుకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి దక్కడంపై అతని స్నేహితులు, కుటుంబసభ్యులు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబున కలిసి ధన్యవాదాలు తెలపగా, ఆయన శ్రీనును అభినందించారు.

## తొలగించిన విశాఖ డెయిరీ కార్మికులను

# విధుల్లోకి తీసుకోవాలి

- 11న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష
- సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

మాట్లాడుతున్న సిఐటియు నేత ఆర్‌కెఎస్‌వి కుమార్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్** : విశాఖ డైయిరీలో గత 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను అకారణంగా యాజమాన్యం విధులు నుంచి తొలగించడాన్ని సిఐటియు విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో బుధవారం సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులందర్నీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పర్మినెంట్ యూనియన్ నాయకుల అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, డైయిరీలో అనేక సంవత్సరాల నుంచి ఏ విధమైన కార్మిక చట్టాలూ అమలు కాకపోయినా పనిచేస్తున్న 305 మంది కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా జూన్ 10వ తేదీ నుంచి నిలిపివేసిందని తెలిపారు. ఈ విషయమై జెసిఎల్ వద్ద పలుమార్లు సమావేశాలు జరిగి, వారందరినీ పనిలో పెట్టుకుంటామని కాంట్రాక్టర్ చెప్పినా, యాజమాన్యం ఇంతవరకూ విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. విశాఖ డెయిరీలో యూనియన్ లేకుండా చేయడం కోసం కార్మికులను తొలగించి భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. విశాఖ డెయిరీలో యాజమాన్యమే బిఎంఎస్ యూనియన్‌ను ఏర్పాటుచేసి అందరూ ఆ యూనియన్‌లోనే ఉండాలని ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. తొలగించిన కార్మికులందర్నీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈనెల 11 ఉదయం 9 గంటల నుండి 12 వ తేదీ ఉదయం 10 గంటల వరకు 24 గంటల పాటు నిరాహార దీక్ష చేయనున్నట్లు ప్రకటించారు. సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సంఘాల నాయకులు వైటి.దాస్, నమ్మి రమణ, విజయ్‌కుమార్, పిఎస్.నారాయణ, యు.రాజు, టి.నూకరాజు, పి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, వి.తులసీరామ్, అశ్రఫ్, శివ, ఆర్.లక్ష్మణమూర్తి, ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమారమంగళం, పి.వెంకటరెడ్డి, రాంబాబు, రాజేంద్రప్రసాద్, లోకేష్, డెయిరీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న గొడౌన్ వర్కర్స్

**ప్రజాశక్తి- ములగాడ** : ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో విద్యుత్ భారాలు వేయడం దుర్మార్గమని ఐపిఎల్ గొడౌన్ వర్కర్స్ యూనియన్, సిఐటియు అధ్యక్షులు పి పైడిరాజు విమర్శించారు. బుధవారం షీలానగర్ టోల్‌గేట్ వద్ద స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ, విద్యుత్ అదనపు ఛార్జీలను తగ్గించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటికే కూటమి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఇపుడు ఆదానీ స్మార్ట్‌మీటర్లు బిగింపుతో మరింత భారం వేయాలనుకోవడం అన్యాయమన్నారు. ఎన్నికలకు ముందుఇచ్చిన హామీలను గుర్తుకు తెచ్చుకుని స్మార్ట్‌మీటర్లను తక్షణం రద్దు చేయకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ప్రస్తుతమున్న విద్యుత్ మీటర్లను యథావిధిగా కొనసాగించడంతోపాటు ట్రూఅప్ సర్దుబాటు పేరుతో పెంచిన ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్. సన్నిబాబు, ఎం కాటమరావు, ఎన్.పైడయ్య, జి శ్రీనివాసరావు, కె రామకృష్ణ పాల్గొన్నారు.

## కార్పొరేట్ల ప్రయోజనాలే కూటమి లక్ష్యం

మాట్లాడుతున్న వైసిపి సమన్వయకర్త చిన్న శ్రీను

**ప్రజాశక్తి - భీమునిపట్నం** : కార్పొరేట్ల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం తహతహలాడుతోందని భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆరోపించారు. బుధవారం స్థానిక బీచ్‌రోడ్డులోని ప్రైవేట్ రిసార్ట్‌లో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ సమావేశంలో మాట్లాడుతూ, భీమిలి నియోజకవర్గ పరిధిలో ఖరీదైన ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టే కూటమి కుట్రలను ప్రతిఘటించాలని వైసిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. విపక్షంగా వైసిపి ఒత్తిడితోనే ఒక్కటొక్కటిగా సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సముద్ర తీరంలో ఫిషింగ్ జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు మత్స్యకారులను ఏకం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యాచరణ చేపట్టాలన్నారు. పార్టీకేడరంతా సమన్వయంగా పనిచేస్తే క్షేత్రస్థాయిలో వైసిపి బలోపేతం అవుతుందన్నారు. జివిఎంసి మూడో వార్డు వైసిపి అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వైసిపి వార్డు నేతలు అక్కర మాని రామునాయుడు, జగుపల్లి ప్రసాద్, ఎస్ కరుణాకరరెడ్డి, పాల రమణారెడ్డి, జీరు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:** న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లాలోని అన్ని న్యాయ స్థానాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారి తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లాలోని న్యాయ స్థానాలలో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్లో మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు అవకాశాన్ని ఎక్కువగా పరిష్కారమవుతున్నాయి.

బాధితులు ఈ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణం, విశాఖపట్నంలో ఫోన్ 0891 -2560414, 2575048 నెంబర్లకు సంప్రదించాలని, vskpdlsa@yahoo.com, dlsa.vsp@ gmail.com వెబ్‌సైట్‌లోనూ, మండల న్యాయ సేవా సంఘాలను సంప్రదించాలని సూచించారు..

## ప్రీపెయిడ్ ఆటో సేవలు ప్రారంభం

ఆటో సేవలను ప్రారంభిస్తున్న సిపి, డిఆర్ఎం

**ప్రజాశక్తి-గోపాలపట్నం** సింహాచలం రోడ్ (గోపాలపట్నం) రైల్వేస్టేషన్ వద్ద :దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో టాక్సిస్టాండ్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, డివిజనల్ రైల్వే మేనేజర్ లోహిత్ బోర్హ బుధవారం ప్రారంభించారు. ఆటోట్యాక్సిలను జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రయాణికులకు భద్రత, సౌకర్యవంతం, సురక్షితమైన గమ్యాన్ని నిర్ధేశించిన తక్కువ ధరలలో అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఈ ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరాల నిఘాలో, ఆటోలకు అమర్చిన జిపిఎస్ అనుసంధానంతో భద్రత ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించే విధంగా అన్ని సౌకర్యాలను సమకూర్చినట్లు తెలిపారు.

ఆటో టాక్సీ స్టాండ్‌లో కంటైనర్ కంట్రోల్‌రూం ఏర్పాటుకు సహక రించిన దాతలు, ఆలివ్ సతీష్, ఫర్నిచర్ సమకూర్చిన సోనోవిజన్, విశాఖపట్నం మేనేజర్ గోపాల్‌లను సిపి, డిఆర్ఎంలు అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో డిసిపి డి.మేరి ప్రశాంతి, ఎడిసిపి ట్రాఫిక్. కె. ప్రవీణ్‌కుమార్, ఎసిపి. ఎబి.పృధ్వీతేజ, గోపాలపట్నం స్టేషన్ హౌస్ ఆఫీసర్. ఎన్‌వి. ప్రభాకరరావు, రైల్వే, లోకల్ పోలీసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుడ్,బ్యాడ్ టచ్‌పై అవగాహన

**ప్రజాశక్తి -మధురవాడ** : మధురవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు గుడ్,బ్యాడ్ టచ్‌తోపాటు పలు అంశాలపై నార్త్ జోన్ ఎసిపి ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో ఐటి సెజ్, శక్తి టీమ్ సభ్యులు బుధవారంఅవగాహన కల్పించారు. శక్తిటీం ఎఎస్ఐ ఎం.సింహాచలం మాట్లాడుతూ, పిల్లలు సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం, ఫొటోలను ఇతరులకు షేర్ చేసుకోరాదని, ఒటిపి లైవ్‌లో ఓపెన్ చేయరాదని సూచించారు. శక్తియాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని, అత్యవసర పరిస్థితులో డయల్ 112, 110, ఎస్ఒఎస్ సేవలను వినియోగించు కోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే తిను బండారాలను తీసుకోరాదని సూచించారు. ట్రాపిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పూర్ణిమ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆత్మరక్షణకు పాఠశాలలో కరాటే క్లాసులు సాధన చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాధిక, బోధన సిబ్బంది, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిర్ణీత సమయంలో సేవలు అందజేయాలి

**- ఆగస్టు 15 నుంచి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధం కావాలి**

**- రెవెన్యూ శాఖ సమీక్షలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

**ప్రజాశక్తి- అనకాపల్లి**

ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, సర్వీసులు నిర్ణీత గడువులోగా అందించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను తప్పక క్షేత్రస్థాయి పరిశీలన చేసి దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పిజిఆర్ఎస్ అర్జీలు, అందరికీ ఇండ్లు, భూముల క్రమబద్ధీకరణ, భూ సర్వే, కోర్టు కేసులు, అన్నదాత సుఖీభవ, రేషన్ పంపిణీ, మ్యుటేషన్లు, ఎపి సేవా సర్వీసులు, నీటితీరువా వసూళ్లు, ఇంటి స్థల దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవితో కలిసి రెవిన్యూ అధికారులతో జిల్లా కలెక్టరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇంటి స్థలం కోసం వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హతలకు అనుగుణంగా అర్హుడైన ప్రతి లబ్ధిదారుల వివరాలు ఆన్లైన్లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసి దరఖాస్తులు పెండింగ్ కాకుండా చూడాలన్నారు. నీటి తీరువా వసూళ్ల ఆగస్టు నాటికి పూర్తిచేయాలన్నారు. భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను ఆగస్టు 15 నుంచి పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆగస్టు 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి మాట్లాడుతూ తదుపరి సమావేశం నాటికి అన్ని రకాల రెవెన్యూ సేవలను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, ఆర్‌డిఓ షేక్ ఆయిషా, జిల్లా పౌరసరఫరాల అధికారి కెవిఎల్ఎన్.మూర్తి, జిల్లా సర్వే అధికారి గోపాల్ రాజు, ఎడ్డీసీలు, తహశీల్దార్లు, ఉపతహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## రొయ్యలు, చేపల ఉత్పత్తికి చర్యలు

**అనకాపల్లి :** అనకాపల్లి జిల్లాలో చేపల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను అదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం చేపల పెంపకం (ఆక్వా జోనేషన్)పై మత్స్యశాఖ, వ్యవసాయ, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో రాంబిల్లి, ఎస్ రాయవరం పాయకరావుపేట మండలాల్లో సుమారు 172.68 ఎకరాల నాన్-అక్వా జోనేషన్ భూమిని అక్వా జోనేషన్‌గా (చేపల పెంపకం ప్రాంతంగా) మార్చేందుకు ఈ కమిటీలో అనుమతి మంజూరు చేసింది. ఈ నిర్ణయం ద్వారా జిల్లాలో అక్వా రైతులకు, స్థానిక అక్వా రైతులకు వ్యాపార నిర్వహణను మరింత సులభతరం అవుతుందన్నారు. జిల్లాలో అక్వాకల్చర్ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. జిల్లాలో పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, చేపలు, రొయ్యలు ఉత్పత్తిని పెంచడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం, విద్యుత్ సబ్సిడీ, అనుమతుల కోసం దరఖాస్తు ప్రక్రియలో సులభతరం వంటి ప్రయోజనాలను అక్వా రైతులు పొందుతారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి జిల్లా జి.విజయ, ప్రగతిశీల మత్స్యకారుడు వి.గోపాల్‌కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ ముకుందరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మెరైన్ పోలీస్ స్టేషన్ల పటిష్టతకు చర్యలు

**అనకాపల్లి :** తీర ప్రాంత రక్షణకు, మెరైన్ పోలీస్ స్టేషన్ల పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి తీర ప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెరైన్ పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్లకు ప్రహరీల నిర్మాణం, మరుగుదొడ్లు, బెంచీలు నిర్మాణం, లైట్లు, బోట్లు రిపేర్, సీసీ కెమెరా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పర్యాటకులు ఎక్కువగా వచ్చే రోజుల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. చేపల వేటకు వెళ్లే పడవలకు ట్రాన్స్పాండర్లు ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెరైన్ పోలీస్ స్టేషన్ అధికారులు, మత్స్యశాఖ పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయితో డిఎస్‌పి శ్రావణి తదితరులు

## 107 కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి-అనకాపల్లి, అనకాపల్లి రూరల్ :** అనకాపల్లి మండలం కుంచంగి గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున అనకాపల్లి రూరల్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన 107 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ ఎం శ్రావణి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుల్లో ముంచింగిపుట్టు, పెదబయలు గ్రామాలకు చెందిన ఇద్దరు మైనర్లు ఉండగా, ప్రధాన నిందితుడు ఆటో డ్రైవర్ చెన్నైకు చెందినవాడని తెలిపారు. ఆటో డ్రైవర్ పరారీ అయ్యాడని, గాలింపు చర్యలు చేపట్టి త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు అదనపు ఆదాయం కోసం ఈ అక్రమ గంజాయి రవాణా చేస్తున్నారన్నారు. ప్రధాన నిందితుడు ఆటో డ్రైవర్ గంజాయిని ఒరిస్సాలో కొని చెన్నైలో విక్రయిస్తుంటాడని తెలియజేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై రవికుమార్, సిబ్బంది సోంబాబు, వెంకటరావు, రాజా బాబు, ఆర్కే నాయుడును అభినందించారు.

## హిందీ పుస్తకాలు అందజేత

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జనసేన నాయకులు తాడి శాంత కుమారి రామకృష్ణ తమ సొంత నిధులతో స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు అందజేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ సూచనలతో ప్రాథమిక హిందీ పుస్తకాలను తాడి శాంతి కుమారి రామకృష్ణ సొంత నిధులతో ఏర్పాటు చేసి వుడ్‌పేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళ రామచంద్రరావు, తాడి రామకష్ణ, పోలారపు త్రినాథ్, హెచ్‌ఎం ఉమమహేష్, ఎంఈఓ శ్రీదేవి, కూటమి నాయకులు అప్పికొండ గణేష్, బర్నికాన రాము, ఆకుల నానాజీ, రాయపురెడ్డి లక్ష్మణరావు, యాలకల సత్య, అయ్యప్ప, కెఎస్ నాయుడు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు ఆలయ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని నూతన దేవాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించి భక్తులకు మెరుగైన సౌకర్యాలతో కూడిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈనెల చివరకు పూర్తిగా దేవాలయ పనులు పూర్తి చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి సుధారాణి, ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలపై ఆందోళన

**ప్రజాశక్తి-కశింకోట :** కసింకోట మండలం తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆశా వర్కర్లు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని విమర్శించారు. ఆశ వర్కర్లకు టిఎ, డిఎ ఇవ్వటం లేదన్నారు. అవసరమైనప్పుడు కనీసం సెలవులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు. జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, యూనియన్ నాయకులు అమ్మాజీ, కుమారి, పద్మ రమణమ్మ, లక్ష్మీ, శ్యామల, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

## మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు జనపాల అప్పలనాయుడు కుటుంబానికి పోలీసులు ఆర్థిక సాయం అందించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు స్వచ్ఛందంగా అందించిన ఒక రోజు డ్యూటీ అలవెన్స్ రూ.3,78,430 నగదు చెక్కును ఎస్పీ కార్యాలయంలో ఎస్‌పి తుహిన్ సిన్హా అప్పలనాయుడు భార్య జనపాల సత్యవతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.

## దీర్ఘకాల వ్యాధులకు హోమియోలో అద్భుత చికిత్స

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** దీర్ఘకాల వ్యాధుల నివారణకు హోమియోలో అద్భుతమైన ఔషధాలు ఉన్నాయని స్థానిక 30పడకల ఆసుపత్రి హోమియో విభాగాదిపతి డాక్టర్ సుమన్ లత అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ. ప్రజల్లో ఇప్పుడిప్పుడే హోమియో వైద్యంపై ఆదరణ పెరుగుతుందని తెలిపారు. దీర్ఘకాల వ్యాధులైన గజ్జి తామర ఇతర చర్మవ్యాధులు, గ్యాస్ ట్రబుల్ ఆయాసం గుండె దడ వంటి వాటికి హోమియో మందులు వాడుకోవచ్చని చెప్పారు. షుగరు వ్యాధిని నియంత్రణలో ఉంచేందుకు మంచి ఔషధాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రిలో మందులు కొరత లేదన్నారు. హోమియో మందుల వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవని పేర్కొన్నారు.

# రింగ్ రోడ్డు భూ సర్వే నిలుపుదల చేయాలి

వినతిపత్రం ఇస్తున్న అప్పన్నపాలెం గ్రామస్తులు, సిఐటియు నేత

**ప్రజాశక్తి-అనకాపల్లి**

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం చీమలాపల్లి రెవెన్యూలో అప్పన్నపాలెం గ్రామం మీదుగా రింగు రోడ్డుకు చేపట్టిన భూ సర్వేను నిలుపుదల చేయాలని కోరుతూ బుధవారం ఆ గ్రామస్తులు ఆర్డిఓ కార్యాలయం ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. చీమలాపల్లి రెవెన్యూ పరిధిలో అప్పన్నపాలెం గ్రామం మీదుగా సర్వేలు చేస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయడం జరిగిందని, దీనిపై అధికారులను వివరణ కోరగా అక్కడ రింగ్ రోడ్డు వస్తుందని చెప్పారని తెలిపారు. అయితే దీనిపై గ్రామసభ నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా సర్వే చేయడం దారుణమన్నారు. కంపెనీల కోసం ఫ్లై ఓవర్ రోడ్లు వేస్తూ ఉన్నారని, కాయగూరలు పండించే పంట భూములను రింగ్ రోడ్డు పేరుతో అభివృద్ధి అని చెప్పి రైతు నోట్లో మట్టి కొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే దీనిని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కూండ్రపు సోము నాయుడు, తమరాన బాబురావు, రెడ్డి వెంకటరమణ, రెడ్డి బాబూరావు, రెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐడిసికి శ్రీప్రకాష్ విద్యార్థి ఎంపిక

**ప్రజాశక్తి-పాయకరావుపేట :** ఈనెల నుండి 16 వరకు విజయవాడలో జరగనున్న లోకల్ ఇండిపెండెన్స్ డే క్యాంపు (ఎల్ఐడిసి)కు శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో బిఎస్సి తృతీయ సంవత్సరం చదువుతున్న టి.శ్వేత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయు పరిధిలో ఎంపికైన ఏకైక ఎన్‌సిసి విద్యార్థి శ్వేత మాత్రమేనని పేర్కొన్నారు. శ్వేత ఎంపికపై విద్యాసంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ఎన్‌సిసి ఏఎన్ఓ పి.సూర్యకుమారి, అధ్యాపకులు అభినందించారు.

టి.శ్వేత

## వార్డు అభివృద్ధి పనులకు సహకరించాలని వినతి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** తమ వార్డు అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ జీవీఎంసీ 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మీ రమేష్ బుధవారం జీవీఎంసి కమిషనర్ కేతన్ గార్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో ఉన్న ఏఎంసీ కాలనీకి సామాజిక భవనం కావాలని, రైల్వే ప్రమాదాల నివారణకు ఏఎంసీ కాలనీ నుండీ లక్ష్మి దేవీపేటకు ఎల్లయ్య కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని, 6, 3, 4 సచివాలయాల మేడపై ఉన్నా అదనంగా భవనం ఏర్పాటు చెయ్యాలని కోరారు. మిరియాల కాలనీ 4వ వీధి రోడ్డు, వేల్పుల వీధి శివాలయం వెనుకాల రోడ్డు, రాఘవేంద్ర స్వామి వారి ఆలయం వద్ద రోడ్డు, మల్లుమనుగుల వారి వీధి రోడ్డు వర్కులకు అనుమతులు వెంటనే ఇవ్వాలని కోరారు.

సైకిళ్లు అందిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు సైకిళ్లు వితరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రతి రోజు రానుపోను 12 కిలోమీటర్లు నడుచుకుంటూ స్కూలుకు వెళ్లే గిరిజన విద్యార్థుల నడక కష్టాలు తీరనున్నాయి. మండలంలోని తామరబ్బ యూపీ స్కూల్లో చదువుతున్న ఏడుగురు గిరిజన చిన్నారులకు వివి చారిటబుల్ ట్రస్టు సంస్థ ఒక్కొక్కరికీ రూ.6వేల విలువ చేసే ఏడు సైకిళ్లను బుధవారం అందజేసింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టోకూరి రాజాబాబు, ఎంపీటీసీ బండి గౌరమ్మ, ఉప సర్పంచ్ గుమ్మడపు మహేష్, ముసలి పైడ్రాజు, శెట్టి మంగరాజు, హెచ్‌ఎం కొరతం కృష్ణ, ఉపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్, అలక గిరిబాబు, ఎంఈఓలు ఉమ, ఉషారాణి పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కశింకోట శివారు శారదానది ఆనుకుని ఉన్న పొలాలు వద్ద ఈ నెల 4వ తేదీన, ఎఎస్ పేట శివారున గత నెల 31న రైతులు పెట్టుకున్న నీటి మోటార్లకు కనెక్షన్లు వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి దొంగలించడం జరిగిందని బాధిత రైతులు కశింకోట పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పంట పొలాలకు నీరు తోడటానికి ఉపయోగించిన మోటార్లకు సంబంధించిన వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కట్ చేసి దొంగలించడం జరిగిందని పేర్కొన్నారు. దొంగలను పట్టుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలని వియంఆర్‌డిఎ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకునాయుడుపాలెం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మొల్లి సింహచల నవనీత వర్మ అలియాస్ చిన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 73, 75లో గత ప్రభుత్వం పైడివాడ అగ్రహారం జగనన్న మెగా లే అవుట్‌లో పేదలకు ఇల్లు నిర్మాణం నిమిత్తం ల్యాండ్ పూలింగ్ చేసిందని తెలిపారు. వీఎంఆర్‌డిఎ ద్వారా లే అవుట్ అభివృద్ధి చేయగా, ఆ లేఅవుట్‌లో వీఎమ్ఆర్‌డిఎ నిబంధనలు ప్రకారం కొంత స్థలాన్ని సర్వే నెంబర్ 75లో సామాజిక అవసరాలకు కేటాయించారని తెలిపారు. ఆ స్థలాన్ని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అక్రమించి ప్లాట్లుగా విభజించి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆ స్థలాన్ని రక్షించాలని కోరారు.

## జనసేన నేత బుజ్జి త్వరగా కోలుకోవాలి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి గెడ్డం బుజ్జి అనారోగ్యం నుండి త్వరగా కోరుకోవాలని కోరుతూ శ్రీవైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన మండల యూత్ అధ్యక్షుడు లింగంపల్లి జ్యోతి కుమార్ మాట్లాడుతూ గడిచిన నాలుగురోజులుగా అనారోగ్య సమస్యతో విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ నాయకుడు గెడ్డం బుజ్జి సంపూర్ణ ఆయురారోగ్యాలతో రావాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పరాపల్లి గ్రామ అధ్యక్షులు తేటకలి అరవింద్, మండల సీనియర్ నాయకులు మాలెం రాజు, జంగులూరు గ్రామ అధ్యక్షులు గొర్లె సతీష్, పెదగుమ్ములూరు గ్రామ అధ్యక్షులు బొడ్డు నవీన్, ఉప్పరాపల్లి గ్రామ ఉపాధ్యక్షులు బొండా ఆది, ఎస్ రాయవరం మండల నాయకులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జనసేన కార్యకర్తలు

# విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం

### విద్యా శాఖ కార్యాలయంలో ఫ్యాప్టో నేతల వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా శక్తి కార్యక్రమాన్ని ఫ్యాప్టో బహిష్కరిస్తుందని తెలియజేస్తూ బుధవారం అనకాపల్లి విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ గొంది చిన్నబ్బాయి, సిరికి దుర్గాప్రసాద్, ఆచంట రవి మాట్లాడుతూ విద్యా శక్తి కార్యక్రమం వల్ల ఉన్నత పాఠశాలలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ముందుగానే ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పాఠాలు బోధిస్తూ ఉండగా, అవే పాఠ్యాంశాలను తిరిగి సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ఆన్లైన్లో ప్రసారం చేయడం వలన ఉపయోగం లేదని, సమయం వృధా అవుతుందని పేర్కొన్నారు. ఆన్లైన్ ప్రసారంలో క్వాలిటీ లేకపోవడం, బోధన అంతా తెలుగు మీడియంలో జరగడం, కరెంటు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. విద్యాశాఖ కమిషనర్ మొదట జూలై నెలకు మాత్రమే ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పి ఇప్పుడు మరలా ఆగస్టు నుండి డిసెంబర్ వరకు పొడిగిస్తున్నట్లుగా ప్రకటించడం సరికాదన్నారు. ఉపాధ్యాయులకు వెనుకబడిన విద్యార్థులకు బోధించడంలో ఎలాంటి ఇబ్బంది లేదని, కాకపోతే ఎవరో ఎక్కడో బోధిస్తున్న పాఠాలను తిరిగి రెండోసారి ప్రసారం చేయడం వల్ల ఉపయోగం లేదన్నారు. ఈ సందర్భంగా ఈ విద్య శక్తి కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య బహిష్కరిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు వత్సవాయి శ్రీలక్ష్మి, సిహెచ్ నాగేశ్వరరావు, డిఎస్.మల్లేశ్వరరావు, కరణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

## పల్లాను కలిసిన ల్యాండ్ పూలింగ్ రైతులు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్ రైతులు బుధవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిశారు. గత ప్రభుత్వం భూములు తీసుకుని తమకు తీరని అన్యాయం చేసిందన్నారు. తమకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పి నేటి వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కాలేదని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన తమకు న్యాయం కాలేదని వాపోయారు. పరవాడ, గాజువాక, సబ్బవరం మండలాల సరిహద్దుల్లో ఉన్న పెదముసిడివాడ గ్రామంలో సుమారు 150 మంది రైతుల నుండి 200 ఎకరాలకు పైగా భూమిని తీసుకున్నట్లు చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన పల్లా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. త్వరలోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసే విధంగా ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది బంధం వెంకటరమణ, స్థానిక ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, టీడీపీ నాయకులు రావాడ నాయుడు, నారపిన్ని సంతోష్ కుమార్, కనక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మునగపాక, చూచుకొండ, ఫునపర్తి గ్రామాలలో టిడిపి నాయకులు బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, గవర కార్పోరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, నాయకులు కాండ్రేగుల శంకర్, కర్రి రామనాగేశ్వరరావు, మణికంఠ, కాండ్రేగుల గణేష్, ఆడారి గోపి, మొల్లేటి భాస్కర్, చదరం శంకర్, యల్లపు శంకర్, కాండ్రేగుల దిలీప్, బొడ్డేడ నర్సింగరావు, కాండ్రేగుల చిన్న, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముగడ రాజారావు, వార్డు ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, యువనాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలకు వివరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.జిల్లా నాయకులు మూది అప్పారావు, ఏడువాక సన్యాసిరావు, వార్డు నాయకులు లింగం సత్యనారాయణ, సబ్బవరపు అప్పలనాయుడు, గాడి సత్యం, ఆదినారాయణ రాజు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ పనులు చేపట్టడం వలన ఏర్పడే ట్రాఫిక్ అంతరాయంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఏపీఐఐసి అనకాపల్లి జోన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం అధికారులతో సమీక్ష సమావేశం ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు, రోడ్డు విస్తరణ పనులు ఎంతవరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణ సందర్భంగా విద్యుత్ స్తంభాలు మార్చే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.

## వెదురుపర్తి దేవాలయ భూముల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట శ్రీవేణుగోపాల్ స్వామి దేవాలయం భూములు శిస్తు వేలం పాట గత నెల 29న వాయిదా పడిన నేపథ్యంలో వెదురుపర్తి గ్రామంలో సర్వే నెంబర్ 53 ఎ, బిలో ఉన్న 7 ఎకరాల 50 సెంట్లు భూములను జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్.సుధారాణి బుధవారం పరిశీలించారు. ఈ భూమిలో ఏయే పంటలు ఉన్నాయి, హద్దులు, ఇతర వివరాలను పరిశీలించారు. శిస్తు వేలం తేదీని ప్రకటిస్తామని చెప్పారు. ఆమె వెంట దేవాలయం కార్యదర్శి సత్య నారాయణ ఉన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని పెద్ద ఉప్పలపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సౌజన్య పచ్చిరొట్ట ఎరువులు ప్రాధాన్యత వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.బీ.యం. శిరీష, వి.ఎ.ఎ. శివ గ్రామ సర్పంచ్ , రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రధానమంత్రి పసల్ భీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి ఎల్‌వై.కాంతమ్మ సూచించారు. మండలంలోని చేనులపాలెం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు.

సమావేశంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

## పి4 సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : పి4 సర్వే పట్ల నిర్లక్ష్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి పి4 రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉద్దేశించిన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, మార్గదర్శుల ఎంపిక పట్ల దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డి కూర్మారావు, కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

సబ్బవరం : బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని అన్ని మౌళిక వసతులు, సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చిన మార్గదర్శులను వెంటనే గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.రమామణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిఎలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో కె.శివప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

## గురుకులంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో సదుపాయాల పట్ల, పరిశుభ్రత పట్ల, విద్యార్థులు చదువుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యసాధనకు ఉపాధ్యాయులు పనిచేసినప్పుడే సాధ్యమవుతుందని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, గణేష్‌ను దుస్సులువా కప్పి సత్కరించారు.

## సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- మునగపాక : మండల కేంద్రం మునగపాక చెరువు కాలవ మూల సంఘంలో రైతులు నూతనంగా నిర్మిస్తున్న సత్తెమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మునగపాక, ఉమ్మలాడ గ్రామాలలో ఉన్న సత్తెమ్మతల్లి, దేవీతల్లి అమ్మవార్ల ఆలయాలను ఆయన దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలలో మూల సంఘం రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ అవసరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : విద్యార్థినులు తమను తాము రక్షించుకునే శక్తిని పొందేందుకు ఆత్మరక్షణ శిక్షణలు అవసరమని దేవరాపల్లి ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. మహిళలపై దాడులు, ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులను ఎదుర్కొనడంలో ఆత్మరక్షణ పాఠాలు కీలకమని ఆయన స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ క్యాప్సూల్ కోర్సులో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కరాటే కోచ్ గెడ్డం నగేష్ విద్యార్థినులకు ప్రాథమిక ఆత్మరక్షణ మెలకువలను నేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పి.కొట్నాబిల్లిలో రేషన్ సరుకుల పంపిణీ

## - ఫలించిన సిపిఎం పోరాటం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో పి.కొట్నాబిల్లి గ్రామంలో రేషన్ సరుకులు అందజేయాలంటూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఆదివాసి గిరిజనులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి రావికమతం సివిల్ సప్లై అధికారులు స్పందించారు. పి.కొట్నాబిల్లి గ్రామంలో ఆదివాసి గిరిజనులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, గిరిజన సంఘం నాయకుడు పాడి బెన్నయ్యలు మాట్లాడుతూ, మండలంలో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలైన టి.అర్జాపురం పంచాయతీ శివారు పి.కొట్నాబిల్లి గ్రామంలో కొండ దొర తెగకు సంబంధించిన గిరిజనులు జీవం సాగిస్తున్నారు. వీరికి గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా ప్రతి ఇంటికి రేషన్ సరుకులు అందించే వారన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ బండ్లను రద్దు పరచడంతో రేషన్ డిపోలకు వెళ్లి బియ్యం తెచ్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. రాను పోను 16 కిలోమీటర్ల మేర సుదూర ప్రాంతాలకు కాలినడకన నడుచుకొని వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే గిరిజనుల ఇబ్బందులపై పోరాటం చేయడంతో స్పందించిన అధికారులు గ్రామంలోని సరుకులు అందించడం ఆనంద దాయకమన్నారు.

బియ్యం తీసుకుంటున్న గిరిజనులు

సత్కరిస్తున్న నాయకులు

### ఎంఇఒ లింగమూర్తి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రావికమతం: రావికమతం మండల విద్యాశాఖ అధికారి (1)గా లింగమూర్తి బుధవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఇప్పటి వరకు రావికమతం మండల విద్యాశాఖ అధికారి(1)గా పనిచేసిన తలుపులు రావికమతం ఇన్చార్జ్ కావటంతో రెగ్యులర్ ఎంఈఓ ను నియమించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన లింగమూర్తికి యుటిఎఫ్ అధ్యక్షులు నాగేశ్వరరావు, సోమ నాయుడు తో పాటు పలువురు ఉద్యోగులు అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ, మండలంలో విద్యా పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

### మహిళా కళాశాల స్వర్ణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాలను జరుపుకోనున్న నేపథ్యంలో ఉత్సవాలకు నాంది పలుకుతూ బుధవారం పోస్టర్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బలమైన సమాజాన్ని, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడంలో మహిళా విద్య కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ, 1975లో కేవలం మూడు కోర్సులతో ప్రారంభమైన ఈ కళాశాల, గత 50 ఏళ్లుగా ఎంతోమంది మహిళలకు ఉన్నత విద్యను అందించిందన్నారు. ఈ సందర్భంగా, కళాశాల రెండు కొత్త అప్రెంటీస్‌షిప్-ఎనేబుల్డ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. బికామ్ (బిఎఫ్ఎస్ఐ - బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్), బిబిఎ లాజిస్టిక్స్ కోర్సులను విద్యార్థినులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అందించి, వారు ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా రూపొందించినట్లు ప్రిన్సిపల్ వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె. విజయ, రూపా, కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్, అధ్యాపకులు టిఎం.నివేదిత, బి.సంతోషి, అనుష, ఆర్.కిరణ్మయి, డి.అరుణ పద్మ, డాక్టర్ పిఎల్.శరణ్య పాల్గొన్నారు.

## సంపద కేంద్రాన్ని వినియోగించాలి

ప్రజాశక్తి - చీడికాడ: పంచాయతీ పరిధిలో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఎంపీడీవో వి హేమ సుందరరావు సూచించారు. మండలంలోని మంచాల పంచాయతీలో సంపద తయారీ కేంద్రాలను, మంచినీటి పథకాలను బుధవారం పరిశీలించారు. మంచినీటి పథకం చుట్టూ పరిశుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, సురక్షితమైన తాగునీరు అందించాలని సూచించారు. అనంతరం సంప్రదాయ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం పరిసరాలు ముళ్ళ పొదలతో నిండి ఉండడంపై మండిపడ్డారు. తక్షణమే సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి సంపద తయారు చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలించి డ్రైనేజీలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నిలవ నీరు లేకుండా చూడాలని దోమల ఆవశ కేంద్రాలను నిర్మూలించాలని తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

## ఆయిల్ పామ్ తోటలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో బుధవారం ఉద్యానవన, పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ తోటల విస్తరణ మహోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఎంఎం.రహీమ్ ఆయిల్ పామ్ పంటల ప్రాముఖ్యత, అంతర పంటలు, ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించారు. ఏపి ఎంఐపి అధికారి జివి.లక్ష్మీ మాట్లాడుతూ, సూక్ష్మబిందు సేద్యం, ఉపయోగాలు, ప్రభుత్వ రాయితీలను వివరించారు. గాదంపాలెం సాగునీటి కాలువ ఛైర్మన్ గొర్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలను పంట పొలాలకు అనుసంధానం చేసి రైతులకు మేలు చేయాలని సూచించారు. పతంజలి మేనేజర్ టి.చంద్ర మాట్లాడుతూ, పంట యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ వంటి విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి ఎస్.శిరీష, సర్పంచ్ ఎస్.సత్యంనాయుడు, గాదంపాలెం కాలువ చైర్మన్ గొర్లి సత్యనారాయణ, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ సాంబమూర్తి, కొత్తమల్లంపేట సర్పంచ్ రాజుబాబు, నాయకులు ఎర్రంనాయుడు, రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మొగలిపురం గ్రామ సర్పంచ్ గండి అరుణ అన్నారు. మండలంలోని మొగలిపురం అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి వి.లలిత కుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్, సత్యం కాలేజీ ఆఫ్ నర్సింగ్ వారి సౌజన్యంతో తల్లిపాల ప్రాముఖ్యత గురించి నాటిక రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, గండి సత్యం పాల్గొన్నారు.

**పరవాడ** : తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి, మేధస్సు అభివృద్ధికి ఎంతో శ్రేయస్కరమని టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా పేర్కొన్నారు. రావాడ గ్రామపంచాయతీ పరిధిలోని శృంగారపాడు అంగన్వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మోటూరు వీరునాయుడు, మొల్లి అప్పలరాజు, అంగన్వాడీ టీచర్ అప్పల రత్నం పాల్గొన్నారు.

నర్సీపట్నంలో సీమంతాలు నిర్వహిస్తున్న డైరెక్టర్, జెడ్‌పిటి

**నర్సీపట్నం టౌన్**:స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సూర్యలక్ష్మి, జెడ్పీటీసీ సుకల రమణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ, తల్లి పాలతో శిశువులకు రోగనిరోధక శక్తి పెరుగు తుందన్నారు.

**తగరపువలస** : తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమని భీమిలి సిడిపిఒ శ్రీదేవి అన్నారు. జివిఎంసి ఒకటో వార్డు చాకలి పేట మెర్జెడ్ అంగన్వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలతోపాటు రెండేళ్లవరకు తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగమణి, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, టిడిపి ఎస్సి సెల్ నాయకులు డి.వెంకటేష్, ఎం సుబ్బారావు పాల్గొన్నారు.

చెక్కును ఇస్తున్న కౌన్సిలర్ పద్మావతి

### సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్థానిక స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చేతుల మీదుగా మాకవరపాలెం మండలం చిన్నరాచపల్లి గ్రామానికి చెందిన చింతలసాయికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 2,65,938రూ. చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆశాజ్యోతిగా నిలుస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 40 మందికి పైగా లబ్దిదారులకు ఈ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.

సత్కరిస్తున్న హెచ్ఎం రామారావు

### హెచ్ఎంలకు ఘన సన్మానం

ప్రజాశక్తి-రావికమతం:ఇటీవల రావికమతం మండలం నుంచి బదిలీపై వెళ్లిన పలు జడ్పీ హైస్కూల్‌లకు చెందిన ప్రధానోపాధ్యాయులకు మేడివాడ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు రామారావు ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, అప్పలనాయుడు, ప్రసన్న కళ,కెఆర్ఎస్ నాయుడు, నాగేశ్వరావులు రావికమతం మండలం నుంచి బదిలీపై వెళ్లడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామారావు మాట్లాడుతూ, అంకితభావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. పాఠశాలలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేసిన వారిని ఘనంగా సన్మానించుకోవడం ఎంతో ఆనందదాయక మన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

### జెబి పురంలో తాగునీటి ఎద్దడి

#### -మోటార్లకు బిగించని విద్యుత్ కనెక్షన్

ప్రజాశక్తి -చీడికాడ: మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని జెబి పురానికి మంచినీటి ఎద్దడి నెలకొందని స్థానిక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలం లోని జె.బి.పురం గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం లో భాగంగా గ్రామంలో రెండు బోర్ మోటార్లు, షెడ్లు కాంట్రాక్టర్ సుమారుగా తొమ్మిది నెలల ముందు ఏర్పాటు చేశారు. మోటార్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయక పోవడంతో నిరూ పయోగంగా మారాయి. గ్రామ సర్పంచ్ గొల్లవెల్లి చిన్నమ్మలు, ఎంపీటీసీ ధర్మిశెట్టి స్వాతి మాట్లాడుతూ, ఎన్ని మార్లు సంబంధిత మండల విద్యుత్ ఏఈ కి చెప్పినా ఏర్పాటు చేయలేదన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందించాలని సర్పంచ్, ఎంపీటీసీ కోరారు.

నిరుపయోగంగా ఉన్న మోటార్

నినాదాలు చేస్తున్న నాయకులు

## దళిత రైతుల అరెస్టు అన్యాయం

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) జిల్లా అధ్యక్షులు లోవచంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులను విడుదల చేయకపోతే పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. జి.కోడూరుకు చెందిన దళిత రైతులు గత 15 రోజులుగా క్వారీ రద్దు చేయాలని కోరుతూ నర్సీపట్నంలోని ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నాయకులు చిరంజీవి మాట్లాడుతూ, వెంటనే క్వారీ రద్దు చేయాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయకపోతే తీవ్ర పరిణామం ఎదుర్కొంటారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రమణ మాట్లాడుతూ,ఈ ప్రభుత్వం ప్రజల వైపు ఉన్నదా లేక మైనింగ్ మాఫియా వైపు ఉన్నదా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బహుజన బొట్టా నాగరాజు, వైస్సార్ కాంగ్రెస్ నాయకులు చంటి బాబు, బాధిత రైతులు మహాలక్ష్మి, చిరంజీవి, దేవుడు రమణ కళ్యాణం తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులతో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

## ఘనంగా ఐద్వా జగదాంబ జోన్ మహాసభ

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** ఐద్వా జగదాంబ జోన్ 7వ మహాసభ ఎన్‌పిఆర్ భవనంలో బుధవారం కె.మణి అధ్యక్షతన నిర్వహించారు. ఐద్వా సీనియర్ నాయకులు ఎం.అన్నపూర్ణ జెండా ఎగురవేశారు. కార్యకలాపాల నివేదికను జోన్ కార్యదర్శి ఆర్.వరలక్ష్మి ప్రవేశపెట్టారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.పద్మ మాట్లాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా పురుషులతోపాటు స్త్రీలకు కూడా సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీతో స్నేహం చేసిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ పితృస్వామ్యాన్ని బలపరుస్తున్నారని, మూఢవిశ్వాసాలను ప్రోత్సహిస్తు న్నారని విమర్శించారు. జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నా నిందితులను బహిరంగంగా సమర్థించడం అత్యంత హేయమైన చర్య అన్నారు. మహిళల శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చడం, పోర్న్ వీడియోల వ్యాపారం వేగంగా పెరుగుతున్నాయన్నారు. బలమైన ఉద్యమం ద్వారానే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఐద్వా భావిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఐద్వా జగదాంబ జోన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

ఐద్వా జగదాంబ జోన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.మణి, ఆర్.వరలక్ష్మి, సభ్యులుగా బి.సత్యవతి, ఎం.అన్నపూర్ణ, ఎం.నాగమణి, పి.ఉమ, ఎన్.గౌరి, కె.వరలక్ష్మి, సిహెచ్.పైడిరాజు, ఎస్.పార్వతి, ఎస్.నాగలక్ష్మి, కె.సరోజిని, పి.మణి, వరలక్ష్మి, హసీనా, వరుణ, అమ్మాజీ, 17 మందితో కమిటీ ఎన్నికైంది.

# బతుకులు బుగ్గిపాలు చేయొద్దు

## -బల్క్ డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణలో పలు పార్టీల నాయకులు, ప్రజలు

**ప్రజాశక్తి - నక్కపల్లి**

నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి ప్రజల బతుకులను బుగ్గిపాలు చేయొద్దని పలు పార్టీల నాయకులు, ప్రజలు స్పష్టం చేశారు. విదేశాల్లో నిషేధించిన కంపెనీలు ఇక్కడెందుకని వారు ప్రశ్నించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై బుధవారం నక్కపల్లి తహాశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. దానిలో పలువురు తమ అభిప్రాయాలను చెప్పుకొచ్చారు.

### ఇఐఎ రిపోర్టు ప్రజలకు ఎందుకు ఇవ్వలేదు

బల్క్ డ్రగ్ పార్క్‌కు సంబంధించిన ఇఐఎ రిపోర్టు భూ నిర్వాసిత గ్రామాల్లో ప్రజలకు ఎందుకు ఇవ్వలేదు. ఈ రిపోర్టు తప్పుల తడక. పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ చర్యలు పరిశీలించేందుకు పూర్తిస్థాయిలో అధికారులు లేరు. ఇప్పటికే ప్రమాదాలు పెరుగుతున్నాయి.

**రాజాన దొరబాబు,**
**సిపిఐ నాయకులు**

### ఇప్పటికే కేన్సర్ వ్యాధులతో చచ్చిపోతున్నారు

హెటిరో కంపెనీ కాలుష్యం వల్ల రాజయ్యపేట ప్రజలు కేన్సర్ వ్యాధి బారిన పడి చనిపోతున్నారు. నేను కేన్సర్ బారిన పడటం వల్ల ఉద్యోగం పోయింది. కంపెనీ వ్యర్థ, రసాయన జలాలను సముద్రంలో, ఉప్పుటేరులో వదలడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి.

**బైరాగి రాజు,**
**మత్స్యకారుడు, రాజయ్యపేట**

### బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దు

పర్యావరణానికి, ప్రజలకు హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయొద్దు. ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిశ్రమలనే స్థాపించాలి. ఇప్పటికే తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. రాజయ్యపేటలో కేన్సర్ వ్యాధులతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఆర్.శంకర్రావు,**
**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి**

### ప్రజల మనోభావాలు అర్థం చేసుకోవాలి

బల్క్ డ్రగ్ పార్కును ఈ ప్రాంత ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. వారి మనోభావాలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. కాకినాడ జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ టిడిపి నేత యనమల రామకృష్ణుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ విధంగా స్థానిక హోం మంత్రి అనిత కూడా ప్రభుత్వానికి లేఖ రాసి, ప్రజలకు సమాధానం చెప్పాలి. మేం బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకం.

**కంబాల జోగులు,**
**మాజీ ఎమ్మెల్యే,**
**వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త**

### విషం చిమ్ముతుంది

బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో విషం చిమ్ముతుంది. కాకినాడలో తరిమేసిన కంపెనీని నక్కపల్లి లో ఏర్పాటు చేయడం దారుణం.

**బివిఎస్ఎన్.రాజు,**
**పెద తీనార్ల**

### మాత్రలు ఇవ్వండి.. బలవంత మరణం పొందుతాం

మాత్రలు ఇవ్వండి.. బలవంతం మరణం పొందుతాం.. అప్పుడు మా భూముల్లో మీరు పరిశ్రమలు స్థాపించుకోవచ్చు. కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదు. బయోడేటాలు పట్టుకుని నాయకులు చుట్టూ తిరుగుతున్నాం. నేటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ పార్కు వద్దేవద్దు

**ప్రసాదుల శ్రీను,**
**డిఎల్.పురం**

### అనారోగ్యాల బారిన పడతాం

ఇప్పటికే స్థానికంగా ఏర్పాటు చేసిన హెటిరో కంపెనీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. బల్క్ డ్రగ్ పార్క్ పేరుతో అనేక పరిశ్రమలు వచ్చినప్పటికీ ఎటువంటి ఉపయోగమూ లేదు. పరిశ్రమల పేరుతో వ్యవసాయ భూములను నాశనం చేస్తే, ప్లాస్టిక్ బియ్యం తినాలా?. రసాయన, మందుల పరిశ్రమలతో అనారోగ్యాల బారిన పడతాం. అదే వ్యవసాయంలో పనిచేస్తే ఆరోగ్యంగా ఉంటాం. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే కాలుష్యం వల్ల పిల్లలు పదేళ్లకే చనిపోయే అవకాశముంది.

**దార్ల ఉమాదేవి,**
**గు(రాజుపేట**

# ప్రజాభిప్రాయ సేకరణ పేరు చెప్పి పాశవికంగా వ్యవహరిస్తారా ?

## బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి - అనకాపల్లి :** బల్క్ డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ సేకరణ పేరిట ప్రభుత్వం, అధికారులు, పోలీసులు పాశవికంగా వ్యవహరించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బల్క్ డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణకు సిపిఎం నాయకులను, గ్రామస్తులను వెళ్లనివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావును, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లను మంగళవారం నుంచే గృహనిర్బంధం చేసిందని తెలిపారు. కోటేశ్వరరావు, అప్పలరాజులను పోలీసులు కారుల్లో ఎక్కించి ఎక్కడెక్కడో తిప్పడంపై మండిపడ్డారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథంను పోలీసులు అత్యంత పాశవికంగా ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యానులో పడేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజలు, ప్రజా సంఘాలు, పార్టీల అభిప్రాయాలు తెలుసుకోకుండా ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రజల ఆరోగ్యాలు, బతుకులపై ప్రభావం చూపే బల్క్ డ్రగ్ పార్కు ఆలోచనను విరమించుకొని ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**విశాఖ కలెక్టరేట్ :** బల్క్‌డ్రగ్ పార్క్‌పై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా సిపిఎం నేతలను నిర్బంధించడాన్ని, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథాన్ని అరెస్టు చేయడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటన విడుదల చేశారు. అక్రమ అరెస్టులకు పూనుకోవడం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అప్రజాస్వామిక చర్యలకు నిదర్శనమన్నారు. ప్రతిపక్షంలో వుండగా ప్రజాస్వామ్యం గురించి నీతులు మాట్లాడిన కూటమి నేతలు అధికారం చేపట్టాక ప్రజల ప్రజాతంత్ర హక్కులను కాలరాసి నిర్బంధానికి పూనుకోవడం దారుణమన్నారు.

**నర్సీపట్నం టౌన్ :** ప్రజాభిప్రాయ సేకరణకు వెళుతున్న సిపిఎం నాయకులను ముందస్తుగా గృహ నిర్బంధం చేయడం ప్రభుత్వానికి సరైన పద్ధతి కాదని ఆ పార్టీ నాయకులు ఈరెల్లి చిరంజీవి నర్సీపట్నంలో బుధవారం నిరసన తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చి మాట్లాడుతున్న నాయకుల్ని బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్లడం అన్యాయమన్నారు.

**దేవరాపల్లి :** బల్క్‌డ్రగ్ పార్కుపై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా సిపిఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తమ ప్రాంతంలో భూ సేకరణ చేపట్టొద్దని, తమ భూములు ఇవ్వబోమని అనేక రూపాల్లో ప్రజలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

**పరవాడ :** నక్కపల్లి బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిగా రద్దు చేయాలని దేశపాత్రునిపాలెం సిపిఎం నాయకులు పి.మాణిక్యం, జ్యోతి, ఎం.సత్యవతి బుధవారం డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా సిపిఎం నేతలను అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

**అనకాపల్లి :** ప్రజలను భయబాంత్రులకు గురుచేస్తూ అత్యంత పాశవికంగా ప్రజాభిప్రాయసేకరణ జరపడం పచ్చి దుర్మార్గమని రైతుకూలీ సంఘం నాయకులు కోన మోహనరావు పేర్కొన్నారు. సిపిఎం, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం, గృహ నిర్బంధాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

అచ్యుతాపురంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

### ముందస్తు అరెస్టులపై నిరసన

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుపై బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం, జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం రాజేష్‌లను అరెస్టు చేయడంపై అచ్చుతాపురం జంక్షన్‌లో సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, మండల కన్వీనర్ ఆర్.రాము బల్క్ డ్రగ్ పార్క్‌ను ఆ ప్రాంతం ప్రజలు వ్యతిరేకిస్తున్నా నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సోమునాయుడు, చేపల తాతయ్య, గోపి, రాజు, అప్పారావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ నాయకులు కదలికలపై పోలీసులు నిఘా

**అనకాపల్లి :** జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌పై ప్రజాప్రాభిప్రాయ సేకరణచ సందర్భంటగా బుధవారం పోలీసులు అనకాపల్లి సిపిఐ నేత వైఎన్ భద్రం కదలికలపై మంగళవారం అర్ధరాత్రి నుంచి పోలీసులు కాపలా పెట్టారు. ఈ సందర్భంగా భద్రం మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు.